సాక్షి తూర్పుగోదావరి

శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024



వలసలు ఆపి.. పనులు చూపి..

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి శుక్రవారంతో 18 ఏళ్లు పూర్తవుతాయి. డాక్టర్ వైఎస్సార్ సీఎంగా ఉన్న సమయంలో ఈ పథకం ప్రారంభమైంది.


II లో



'సిద్ధం' సభకు పటిష్ట భద్రత

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 3న హాజరు కానున్న 'సిద్ధం' సభకు పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నామని ఏలూరు ఎస్పీ మేరీ ప్రశాంతి చెప్పారు.

9,100 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 9,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,600, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 4,500 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.20 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

87.24 శాతం మందికి పింఛన్ల పంపిణీ



రాయుడుపాకలు గ్రామంలో బత్తిన చంద్రమ్మకు వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న కోలమూరు-4 వలంటీర్ పోడి మీనాదేవి

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో కోడి కూయక ముందే వలంటీర్లు వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రారంభించారు. తొలి రోజయిన గురువారం 87.24 శాతం మందికి పింఛన్లు అందజేయడం ద్వారా రాష్ట్రంలోనే జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. జిల్లాలో 14 రకాల పింఛన్‌దారులు 2,45,652 మందికి రూ.72.92 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, ఒక్క రోజులోనే 2,14,304 మందికి రూ.63.58 కోట్లు అందజేసినట్లు డీఆర్‌డీఏ - వైఎస్సార్ క్రాంతి పథం పీడీ ఎన్‌వీఎస్ మూర్తి వివరించారు. జిల్లాలో పింఛన్ల పంపిణీలో నిడదవోలు అర్బన్ 93.19 శాతంతో ప్రథమ, 79.87 శాతంతో రంగంపేట మండలం చివరి స్థానాల్లో ఉన్నాయని తెలిపారు.

డీఎస్పీల బదిలీలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో గురువారం డీఎస్పీల బదిలీలు జరిగాయి. అమలాపురం డీఎస్పీ అంబికా ప్రసాద్ రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీగా నియమితులయ్యారు. కాకినాడ 3వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ బి.అప్పారావును స్పెషల్ బ్రాంచి డీఎస్పీగా లో నియమించారు. చిత్తూరు నుంచి కె.శ్రీనివాసమూర్తి రాజమహేంద్రవరం క్రైం డీఎస్పీగా, ఎస్సీ, ఎస్టీ డీఎస్పీగా పని చేస్తున్న సీహెచ్ శ్యామలరావు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డీఎస్పీగా నియమితులయ్యారు. రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు నార్త్ జోన్‌కు, సత్తెనపల్లి దిశ డీఎస్పీ బి.ఆదినారాయణ రాజమహేంద్రవరం దిశ డీఎస్పీగా, గుంటూరు దిశ డీఎస్పీ చెంచు రామారావు కొవ్వూరు డీఎస్పీగా, ఇప్పటి వరకూ వెయిటింగ్‌లో ఉన్న ఎల్.మోహనరావు డీఎస్‌ఆర్‌పీ డీఎస్పీగా, సీఐడీ డీఎస్పీ బి.రామకృష్ణ రామచంద్రపురం, జిల్లా స్పెషల్ బ్రాంచి డీఎస్పీ డి.రామవర్మ డీటీసీకి, క్రైం డీఎస్పీ జీసీ గురునాథ్‌బాబు సత్తెనపల్లి, కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ నరసారావుపేటకు, డీఎస్‌ఆర్‌పీలో పని చేసిన బీవీఎస్ నాగేశ్వరరావు విజయవాడలో అదే సెక్షన్‌కు, డీసీఆర్‌బీలో పని చేసిన ఎ.శ్రీనివాసరావు సత్యసాయి జిల్లా దిశ డీఎస్పీగా బదిలీ అయ్యారు.

నేడు నైతికత, మానవ విలువలపై పరీక్ష

రాయవరం: ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు శుక్రవారం ఎథిక్స్ అండ్ హ్యూమన్ వేల్యూస్‌పై పరీక్ష నిర్వహిస్తున్నారు. ఫస్టియర్ సైన్స్, ఆర్ట్స్ అండ్ ఒకేషనల్ విద్యను అభ్యసించే విద్యార్థులందరికీ నైతికత, మానవ విలువలు, పర్యావరణ విద్యను రెండు సబ్జెక్టులుగా బోధిస్తున్నారు. ఈ రెండు పరీక్షలకు తప్పనిసరిగా హాజరు కావాలి. ఈ పరీక్షతో పాటు ప్రాజెక్టు వర్కులో ఉత్తీర్ణులైతేనే సెకండియర్ పాస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు.

జవహర్‌పై ఫైర్

- కొవ్వూరు టీడీపీలో మళ్లీ భగ్గుమన్న అసమ్మతి
- అచ్చిబాబు వర్గీయుల ఆగ్రహ స్వరం
- మాజీ మంత్రి జవహర్‌కు టికెట్టు ఇవ్వద్దని డిమాండ్
- ఆయన గ్రూపు రాజకీయాలకు తెర తీశారని ఆరోపణ
- వర్గ విభేదాలతో పార్టీ శ్రేణుల్లో అయోమయం



జవహర్‌కు టికెట్టు ఇవ్వొద్దంటూ ప్లకార్డులు పదర్శిస్తున్న టీడీపీ శ్రేణులు

కొవ్వూరు: వారం పది రోజుల్లో టీడీపీ టికెట్లు ప్రకటిస్తారన్న సమాచారంతో కొవ్వూరు నియోజకవర్గ టీడీపీలో నెలకొన్న విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. గ్రూపు రాజకీయాలు రోడ్డున పడ్డాయి. మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ అభ్యర్థిత్వం ఖరారయ్యే సూచనలున్నాయన్న సంకేతాలతో ఆయన వ్యతిరేక వర్గం కొన్నాళ్లుగా అసంతృప్తి గళం విప్పుతున్న విషయం తెలిసిందే. జవహర్‌ను టార్గెట్‌గా చేసుకుని ఆయనకు వ్యతిరేకంగా ఉన్న పెండ్యాల అచ్చిబాబు వర్గీయులు వారం రోజులుగా గ్రూపు రాజకీయాలు నడుపుతున్నారు. ఈ క్రమంలోనే నియోజకవర్గ టీడీపీ నాయకుల ఆత్మీయ సమావేశం పేరిట కొవ్వూరు లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో గురువారం సమావేశం నిర్వహించారు. దీనికి అచ్చిబాబు వర్గీయులు సారథ్యం వహించారు. ఈ సందర్భంగా జవహర్‌కు టికెట్టు ఇవ్వద్దన్న ఏకైక నినాదాన్ని తెర పైకి బలంగా తీసుకువచ్చారు.

గ్రూపులకు తెర తీశారు

ఈ సమావేశం పూర్తిగా జవహర్‌ను టార్గెట్ చేస్తూ సాగింది. 'కేఎస్ జవహర్ వద్దు.. టీడీపీ ముద్దు' అంటూ పలువురు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. తనకు టికెట్టు వచ్చినట్లు జవహర్ ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో పార్టీ నాయకులను గ్రూపులుగా విభజించి అనైక్యతకు దారి తీసేలా జవహర్ పని చేశారని మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని సూర్య భాస్కర రామ్మోహన్ (చిన్ని) ఆరోపించారు. నియోజకవర్గంలో 2014 నుంచి 2019 వరకూ పార్టీని రెండు వర్గాలుగా విడదీసి భ్రష్టు పట్టించారని అన్నారు. ఈ నేపథ్యంలో 2020లో అధిష్టానం ద్విసభ్య కమిటీ ఏర్పాటు చేసి, గ్రూపులను సమన్వయంపరిచే ప్రయత్నం చేసిందన్నారు. ఇటీవల రాజమహేంద్రవరంలో రా.. కదలిరా సభ నిర్వహించినప్పుడు, చంద్రబాబు అరెస్టు సమయంలోను పార్టీని రెండు గ్రూపులుగా విభజించి కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. 2021లో జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా జవహర్ బాధ్యతలు స్వీకరించినప్పట్నుంచీ వర్గ రాజకీయాలను ప్రోత్సహిస్తూ వచ్చారని ఆరోపించారు. ఏకపక్ష నిర్ణయాలు, నచ్చిన వారికే పదవులు కేటాయింపు చేసుకున్నారని ఆరోపించారు. జిల్లా అధ్యక్షుడిగా ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేయడం మాని, శుభకార్యాలు, పరామర్శలకు వెళ్లడమే నాయకత్వంగా భావించారని చిన్ని విమర్శించారు. ఎస్సీ విభాగం నాయకుడు మాట్లాడుతూ, గతంలో తనను ఓడించడానికి ప్రత్యర్థులకు సైతం జవహర్ సొమ్ములు సర్దుబాటు చేశారని, దళితుడినైన తన పైనే హత్య కేసు నమోదు చేయించి, వేధించారని ఆరోపించారు. నియోజకవర్గంలో జవహర్ విద్వేషాలు రెచ్చగొట్టినా పార్టీ కోసమే ఇన్నాళ్లూ మౌనంగా ఉన్నామని తెలుగు యువత నాయకుడు కాకర్ల సత్యేంద్ర అన్నారు. టీడీపీలో తనకు వ్యతిరేకంగా ఉన్న నాయకులందరినీ అణగదొక్కేందుకు జవహర్ ప్రయత్నించారని ఆరోపించారు.

అందుకే 2014–19 మధ్య అధికారంలో ఉన్నప్పటికీ ఆయనపై ప్రత్యక్ష పోరాటం చేశామని అన్నారు. చాగల్లు మాజీ ఎంపీపీ కేతా సాహెబ్, తెలుగు యువత నాయకులు నాదెండ్ల శ్రీరామ్, ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ తదితరులు కూడా మాట్లాడారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి శ్రీదేవి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, తెలుగు యువత నాయకుడు సూర్యదేవర రంజిత్, పార్టీ పట్టణ అధ్యక్షుడు దాయన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు లేదు... కొవ్వూరు రాదు!

గత ఎన్నికల సమయంలో కూడా అచ్చిబాబు వర్గం జవహర్‌ను తీవ్రంగా వ్యతిరేకించింది. దీంతో టీడీపీ అధిష్టానం కొవ్వూరు టికెట్టును పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనితకు ఇచ్చి, జవహర్‌ను కృష్ణ జిల్లా తిరువూరు పంపించింది. అక్కడ ఓటమి పాలైన జవహర్ ఐదేళ్ల నుంచి కొవ్వూరునే కేంద్రంగా చేసుకుని రాజకీయాలు చేస్తున్నారు. ఇటీవల ఐవీఆర్ఎస్‌లో సర్వేలో జవహర్ పేరును ప్రముఖంగా ప్రస్తావించడంతో ఆయనకు పొగ పెట్టేందుకు ప్రత్యర్థులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇటీవల జవహర్ పుట్టిన రోజు సందర్భంగా ప్రారంభమైన తాజా విభేదాలు ప్రస్తుతం తారస్థాయికి చేరాయి. ఇప్పుడు ఏకంగా జవహర్ వద్దనే ఏకైక నినాదంలో ప్రత్యర్థి వర్గం భారీ సభ నిర్వహించడంతో ఆయనకు టికెట్టు ఖరారు కావడం కష్టమేనని పలువురు భావిస్తున్నారు. తిరువూరు వదిలేసి కొవ్వూరుపై ఆశలు పెంచుకున్న జవహర్‌కు ఈసారి కూడా ఆశాభంగం తప్పదని అంటున్నారు.

అచ్చిబాబు సూచించిన వ్యక్తికే టిక్కెట్?

నియోజకవర్గంలో అచ్చిబాబు సూచించిన వ్యక్తులకే టికెట్టు ఇస్తారని అత్యధిక నాయకులు అభిప్రాయపడ్డారు. అభ్యర్థుల ఖరారులో పార్టీ శ్రేణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు చంద్రబాబు తరచూ ప్రకటిస్తుండగా.. ఇక్కడ మాత్రం అచ్చిబాబు మాటే వేదమని, ఆయన చెప్పినవారికే టికెట్టు అని పలువురు చెప్పడం విశేషం. అచ్చిబాబును కాదనే వారికి నియోజకవర్గ టీడీపీలో చోటు లేదని కూడా నాయకులు మాట్లాడటం గమనార్హం. ఈ పరిస్థితుల్లో టీడీపీ అధిష్టానం అచ్చిబాబు మాటకు విలువ ఇస్తుందా.. లేక ఐవీఆర్ఎస్ సర్వేల ఆధారంగా టికెట్టు కేటాయిస్తుందా అనే విషయం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఏది ఏమైనా నియోజకవర్గ టీడీపీలో ఎనిమిదేళ్లుగా నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గ విభేదాలు.. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో భగ్గుమనడం.. అందునా జిల్లా టీడీపీ అధ్యక్షుడి పైనే తిరుగుబాటు బావుటా ఎగురవేయడంతో టీడీపీ శ్రేణులు అయోమయంలో పడ్డాయి.

రీ సర్వే పనులు వేగవంతం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రీసర్వే పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. వివిధ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాధవీలత, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రిజిస్ట్రేషన్ల కోసం జిల్లాలో 57,918 ప్లాట్ల మ్యాపింగ్ పూర్తి చేశామని చెప్పారు. సుమారు 55 వేల ప్లాట్లకు సరిహద్దులు గుర్తించామన్నారు. వీటిలో 54 వేల ప్లాట్లు రిజిస్ట్రేషన్‌కు సిద్ధమయ్యాయని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద 48 లక్షల పనిదినాలకు గాను 44.52 లక్షలు సాధించామని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో 46,766 మందికి వైద్య సేవలు అందించామని చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్ఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రూ.9.91 లక్షల నగదు స్వాధీనం

కొవ్వూరు: పలాస నుంచి విజయవాడ వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులోని రెండు పార్సిళ్లలో ఉన్న రూ.9,91,820 నగదును, 17 గ్రాముల బంగారు గొలుసును పట్టణ పోలీసులు గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. విజయవాడలో ఇవ్వాలంటూ శ్రీకాకుళంలో ఇద్దరు వ్యక్తులు ఈ రెండు పార్సిళ్లు ఇచ్చినట్లు డ్రైవర్ బాలా దివాకర్ చెబుతున్నారు. తొలుత ఆదిత్య అనే వ్యక్తి శ్రీకాకుళంలో ఒక పార్సిల్ ఇచ్చారని, కొద్దిసేపటి తర్వాత ధనుష్ అనే మరో వ్యక్తి పార్సిల్‌పై ఫోన్ నంబర్ రాసి విజయవాడలో ఇవ్వాల్సిందిగా చెప్పారని తెలిపారు. విజయవాడలో అందజేసేందుకు ఒకరు రూ.200, మరొకరు రూ.300 చొప్పున ఇచ్చారని చెబుతున్నారు. ఒక పార్సిల్‌లో రూ.3.50 లక్షలు, మరో పార్సిల్‌లో రూ.6,41,820 నగదుతో పాటు 17 గ్రాములకు పైగా బంగారు గొలుసు ఉన్నాయని పోలీసుల తనిఖీలో బయటపడింది. వీటికి ఎటువంటి ఆధారాలూ చూపలేదని పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. రూ.3.50 లక్షల పార్సిల్ ఇచ్చిన వ్యక్తిని ఆరా తీయగా, ఆ సొమ్మును కేఎల్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ ఫీజు నిమిత్తం పంపినట్టు చెప్పారని తెలిపారు. మరో పార్సిల్‌కు సంబంధించి ఆరా తీయగా, తన సోదరుడికి సొమ్ములు, బంగారు గొలుసు పంపినట్టు చెప్పారన్నారు. ఎటువంటి ఆధారాలూ లేకపోవడంతో ఈ నగదు, బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, బస్సును స్టేషన్‌కు తరలించామని సీఐ తెలిపారు. నగదును తహసీల్దార్‌కు స్వాధీనం చేస్తామన్నారు. స్పష్టమైన ఆధారాలు చూపిన తర్వాతే నగదు అప్పగిస్తామని చెప్పారు.

నెరవేరనున్న ఏళ్లనాటి కల

- నిడదవోలు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం
- నేడు పనులకు భూమిపూజ చేయనున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- నిర్వాసితులకు రూ.10.65 కోట్లు నష్టపరిహారం అందజేత

నిడదవోలు: ఉభయ గోదావరి జిల్లాల ప్రజల చిరకాల స్వప్నం నెరవేరనుంది. నిడదవోలు రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఆమోదం లభించింది. అందుకు నిధులు కూడా కేటాయించింది. ఆర్‌ఓబీ నిర్మాణానికి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు చేసిన కృషి సాకారం కానుంది. పట్టణ నడిబొడ్డున నెహ్రూ బొమ్మ సెంటర్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఆర్‌ఓబీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శుక్రవారం భూమిపూజ చేయనున్నారు. సేతు బంధన్ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 9 ఆర్‌ఓబీలకు రూ.532 కోట్లు మంజూరయ్యాయి. అయితే ఉభయ గోదావరి జిల్లా ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్‌ఓబీ ప్రాధాన్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే వివరించారు. దీంతో సీఎం నిడదవోలు ఆర్‌ఓబీకి రూ.184.74 కోట్లు కేటాయించారు. 2019 ఎన్నికల సమయంలో నిడదవోలు పర్యటనకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు హడావుడిగా ఆర్‌ఓబీకి శంకుస్థాపన చేసి వదిలేశారు. ఆర్‌ఓబీ కడుతున్నామంటూ టీడీపీ నాయకులు అప్పట్లో ప్రచారం చేసుకున్నారే తప్ప కనీసం భూసేకరణ పనులు కూడా చేపట్టలేదు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు తప్పకుండా ఆర్‌ఓబీ నిర్మిస్తామని ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు నిర్మాణానికి బాటలు వేశారు. ఎట్టకేలకు తమ చిరకాల కల నెరవేరుతోందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పరిహారం అందజేత

నిడదవోలు పట్టణంతో పాటు సమిశ్రగూడెం గ్రామంలో భూసేకరణలో భాగంగా స్థలాలు, నిర్మాణాలు కోల్పోయిన వారికి ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు కృషితో ఇప్పటికే రూ.10.60 కోట్లు పరిహారంగా అందజేశారు. దీంతో వ్యాపారులు, నిర్వాసితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ, నిడదవోలు ఆర్‌ఓబీ విషయంలో టీడీపీ నాయకులు ఎలాంటి ప్రయత్నాలూ చేయలేదని ఆరోపించారు. ప్రజలను మోసం చేయడమే నైజంగా పెట్టుకున్న చంద్రబాబు నాయుడు రైతుల రుణమాఫీ, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి వారిని నిలువునా వంచించారని అన్నారు. రాజధాని నిర్మిస్తామని గ్రాఫిక్ చూపించిన విధంగానే నిడదవోలు ఆర్‌ఓబీ చేపడతామని గత టీడీపీ నాయకులు కూడా నిడదవోలు నియోజకవర్గ ప్రజలకు గ్రాఫిక్ చూపించారని అన్నారు. తమ నాయకుడు, జననేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేనున్నాను అంటూ ఇచ్చిన మాట ప్రకారం.. ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు, ప్రయాణికుల ఇబ్బందులు, అవసరాలను దృష్టిలో పెట్టుకుని వాటిని అధిగమించేందుకు ఒక్క నిడదవోలు ఆర్‌ఓబీకే రూ.184.74 కోట్లు కేటాయించారని చెప్పారు. ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు.



ఆర్‌ఓబీ పనుల కోసం సిద్ధంగా ఉన్న భారీ యంత్రాలు



పాదగయ క్షేత్రం

పిఠాపురం

- పిఠాపురం మున్సిపాలిటీలో ప్రధాన సమస్యల పరిష్కారం
- నాలుగున్నర ఏళ్లలో 40 ఏళ్ల ప్రగతి
- ఆధ్యాత్మిక కేంద్రంలో అభివృద్ధి పరుగులు





పిఠాపురంలో ప్రభుత్వ పాఠశాలలు నాడు - నేడు

పిఠాపురం: రావు వెంకట కుమార మహీపతి సూర్యరావు బహద్దూర్ పరిపాలించిన ప్రాంతం పిఠాపురం. 1957లో మున్సిపాలిటీగా ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎనిమిది మంది చైర్మన్లు పరిపాలించారు. ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. అటువంటి చారిత్రక పిఠాపురం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. 2019 నుంచి ఇప్పటి వరకు రూ.150 కోట్లు పైగా వ్యయంతో పట్టణంలో అభివృద్ధి పనులు నిర్వహించారు. నాలుగున్నర ఏళ్లలో 40 ఏళ్ల ప్రగతి సాధించింది.

ఏళ్ల నాటి సమస్యలకు పరిష్కారం

పట్టణంలో పారిశుధ్య లోపం ప్రధాన సమస్యగా ఉండేది. రోడ్లు, డ్రైన్లు మురికి కూపాలుగా మారి ప్రజలు తీవ్ర అవస్థలకు గురయ్యేవారు. గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.6 కోట్ల వ్యయంతో అన్ని వార్డుల్లోనూ రోడ్లు, డ్రైన్లు నిర్మించారు. ఇప్పటి వరకు పట్టణంలో అందరితో పాటు ఇతర ప్రాంతాల ప్రజలకు పెద్దాసుపత్రిగా ఉన్న సీహెచ్‌సీని ఆధునీకరించారు. స్త్రీల వార్డును మెరుగుపరిచారు. వైద్య సదుపాయాలు పెరిగాయి. పట్టణంలో మంగయ్యమ్మరావు పేటలో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మించారు. పట్టణానికి వచ్చే వారికి ఇప్పటి వరకు నరకం చూపించిన రైల్వే గేట్ల సమస్యకు పరిష్కారం చూపించి మాధవపురం, గోర్స రైల్వే గేట్ల వద్ద ఆర్‌యూబీలు నిర్మించారు. ప్రధాన రహదారిలో ఉన్న ఉప్పాడ రైల్వే గేటు వద్ద ఆర్‌ఓబీ నిర్మాణానికి పనులు వేగవంతం చేశారు. ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకుల కోసం స్థానిక రైల్వే స్టేషన్‌ను రూ.కోట్లతో ఆధునీకరించారు. పట్టణంలో ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారి అభివృద్ధితో పాటు రైతు భరోసా కేంద్రాలు, అంగన్‌వాడీ సెంటర్లు నిర్మించారు. మంచినీటి సరఫరా వ్యవస్థను ఆధునీకరించడానికి సుమారు రూ.32 కోట్లు వెచ్చిస్తున్నారు.

రూపురేఖలు మారిన పాఠశాలలు

పట్టణంలో ఉన్న 79 పాఠశాలల్లో మొదటి విడత నాడు – నేడు నిధులు రూ.11.07 కోట్లతో 40 పాఠశాలలను అభివృద్ధి చేశారు. రెండవ విడత నాడు–నేడు నిధులు రూ.20.12 కోట్లతో 56 పాఠశాలలను అభివృద్ధి చేసే పనులు పూర్తి కావచ్చాయి. తొలి విడత అభివృద్ధి చేసిన కొన్ని పాఠశాలల్లో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించే పనులు చేపట్టారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారి ప్రైవేటుకు దీటుగా తయారయ్యాయి.

2019 నుంచి ఇదీ అభివృద్ధి

- **2019 నుంచి ఇప్పటి** వరకూ అభివృద్ధి పనులకు **మున్సిపాలిటీ వెచ్చించి**న నిధులు రూ.62.97 కోట్లు.
- **రూ.85 లక్షలతో వైఎ**స్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ **నిర్మాణం.**
- **రూ.8.84 కోట్ల 14వ**, రూ.5.21 కోట్ల 15వ ఆర్థిక **సంఘాల నిధులతో అ**భివృద్ధి పనులు.
- **రూ.5.50 లక్షలతో జ**గనన్న నగర బాటల అభివృద్ధి.
- **రూ.98.50 లక్షల** ఎంపీ ల్యాండ్స్ నిధులతో **పట్టణంలో పలు అభివృ**ద్ధి పనులు.
- **రూ.6 కోట్ల గడప గ**డపకూ మన ప్రభుత్వం నిధు**లతో అభివృద్ధి కార్యక్ర**మాలు
- **రూ.9.93 కోట్ల జన**రల్ ఫండ్స్‌తో అభివృద్ధి.
- **రూ.30.10 కోట్ల** అమృత్ సరోవర్ నిధులతో తాగునీటి సరఫరా పనులు (త్వరలో ప్రారంభం)
- రూ.5.50 కోట్లతో మాధవపురం రైల్వే అండర్ బ్రిడ్జి.
- రూ.4.50 కోట్లతో రైల్వే గోర్స అండర్ బ్రిడ్జి
- రూ.150 కోట్లతో ఉప్పాడ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం (త్వరలో ప్రారంభం)
- రూ.5 కోట్లతో రైల్వే స్టేషన్ ఆధునీకరణ.



పిఠాపురంలో కొత్తగా నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్

మున్సిపాలిటీ ముఖచిత్రం

విస్తీర్ణం	19.57 చదరపు కిలోమీటర్లు
వార్డులు	30
జనాభా	52,304
పురుషులు	25,892
స్త్రీలు	26,412
కుటుంబాలు	14,498
ఓటర్లు	41,435
పురుషులు	19,919
స్త్రీలు	21,514
ఇతరులు	2
వార్డు సచివాలయాలు	15
సచివాలయ సిబ్బంది	142
వలంటీర్లు	279
ఆస్పత్రులు- కమ్యూనిటీ హెల్త్ సెంటర్	1
అర్బన్ హెల్త్ సెంటర్	1
ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు	2
ప్రభుత్వ జూనియర్ కాలేజీలు	2
ప్రభుత్వ పాఠశాలలు- హైస్కూళ్లు	16
యూపీ స్కూళ్లు	8
ప్రాథమిక పాఠశాలలు	56
విద్యార్థులు: ప్రాథమిక పాఠశాలల్లో	1,917
యూపీ స్కూళ్లల్లో	1,010
హైస్కూళ్లలో	6,334
పింఛన్లు	5,870

- రోడ్లు 166 కిలోమీటర్లు. వీటిలో ఆర్‌అండ్‌బీ రోడ్లు 5 కిలోమీటర్లు, సీసీ రోడ్లు 62 కిలోమీటర్లు, బీటీ రోడ్లు 54 కిలోమీటర్లు, మెటల్ రోడ్లు 27 కిలోమీటర్లు
- వీధి దీపాలు: 2వేలకు పైగా
- ఇంటి కుళాయిలు 5,890

ప్రభుత్వ సహకారంతో పట్టణ అభివృద్ధి



ప్రభుత్వం అందించిన ప్రోత్సాహంతో పిఠాపురం పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేసుకోగలిగాం. ఎప్పటి నుంచో ఉన్న ప్రధాన సమస్యలైన రోడ్లు, డ్రైన్లు వంటివి అభివృద్ధి చేసుకున్నాం. మున్సిపాలిటీ ద్వారా ఇప్పటి వరకు ఎప్పుడూ లేని విధంగా రూ.63 కోట్లకు పైగా నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేశాం. మరిన్ని నిధులు వచ్చే అవకాశం ఉంది. ఇంకా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఒక్కో వార్డు సచివాలయానికి రూ.20 లక్షలు ఇచ్చారు. మేము చేసిన విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే పెండెం దొరబాబు సీఎం దృష్టికి తీసుకెళ్లగా మరో రూ.20 లక్షల చొప్పున అదనపు నిధులు ఇచ్చారు. దీంతో పట్టణంలో అన్ని ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపించగలిగాం. మున్సిపాలిటీగా మారిన తరువాత ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఇచ్చిన దాఖలాలు లేవు. అంతా సీఎం వైఎస్ జగన్ వల్లే సాధ్యమైంది.

– గండేపల్లి సూర్యావతి, చైర్‌పర్సన్, పిఠాపురం మున్సిపాలిటీ

సీఎం ఆదేశాలతో ప్రగతి సాకారం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పట్టణంలో అతి ముఖ్యమైన సమస్యలకు పరిష్కారం చూపించాం. ముఖ్యంగా ఉప్పాడ రైల్వే గేటు వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణం రూ.150 కోట్ల వ్యయంతో చేపడుతున్నాం. దీని పనులు వేగవంతం చేశాం. మాధవపురం, గోర్స రైల్వే గేటుల వద్ద ఆర్‌యూబీలు నిర్మించాం. ఇప్పటికే రెండూ ప్రజలు వినియోగించుకుంటున్నారు. పిఠాపురం రైల్వే స్టేషన్‌ను ఇప్పటి వరకు ఎవరూ చేయని విధంగా అభివృద్ధి చేశాం. ఆధునిక సాంకేతిక పరికరాల ఏర్పాటుతో పాటు ప్రధాన రైళ్ల నిలుపుదలకు చర్యలు తీసుకున్నాం. భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేయడానికి అన్ని చర్యలూ తీసుకున్నాం.

– వంగా గీత, ఎంపీ, కాకినాడ

మరింత అభివృద్ధి చేస్తాం



పిఠాపురం మున్సిపాలిటీలో ఉన్న అన్ని సమస్యల పరిష్కారం సీఎం వైఎస్ జగన్ చొరవతోనే సాధ్యమైంది. ఆయన అడిగిన వెంటనే సచివాలయాలకు అదనపు నిధులు ఇచ్చారు. ప్రధాన సమస్యలు అయిన రోడ్లు, డ్రైన్లు పూర్తి స్థాయిలో నిర్మించడానికి ఆయన సహకారం ఎంతో ఉపయోగపడింది. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేయడానికి ఆయన సహకారం ఉంటుందని మాకు నమ్మకం ఉంది. ఆయన తిరిగి మళ్లీ ముఖ్యమంత్రిగా రావడం ఖాయం. పట్టణాన్ని మరింత అభివృద్ధి చేయడం ఖాయం.

–పెండెం దొరబాబు, ఎమ్మెల్యే, పిఠాపురం

క్లుప్తంగా

గురుకులం విద్యార్థి ఆచూకీ లభ్యం



యశ్వంతకుమార్‌తో గురుకులం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

అల్లవరం: గోడి బాలుర గురుకులంలో మంగళ వారం ఉదయం అదృశ్యమైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కోరుకొండ యశ్వంత కుమార్‌ని అంబాజీపేట బస్ స్టేషన్‌లో గురు కులం ప్రిన్సిపాల్, సిబ్బంది గురువారం గుర్తిం చారు. అల్లవరం ఎస్సై హరీష్‌కుమార్ సమక్షం లో నేరుగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్సై హరీష్‌కుమార్ విద్యార్థికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

అధిక లోడు లారీలకు భారీ జరిమానా



ప్రత్తిపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్న అధిక ఇసుక లోడు లారీలు

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద అధిక లోడుతో వెళ్తున్న ఇసుక లారీలకు మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్ గురువారం రూ.2,40,500 భారీ జరిమానా విధించారు. రాజమహేంద్రవరం నుంచి తొండంగి మం డలం పరిశ్రమల కారిడర్ (దివిస్)కు తరలు తున్న మూడు ఇసుక లారీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ లారీలకు కత్తి పూడి మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్ బి.శ్రీనివాస్ రూ.75,500, రూ.80 వేలు, రూ.85 వేలు వెరసి రూ.2,40,500 అపరాధ రుసుం విధించారు.

వలసలు ఆపి.. పనులు చూపి..

- నేటితో ఉపాధి హామీకి 18 ఏళ్లు పూర్తి
- పథకంలో పెను మార్పులు
- వలసల నివారణ, ఉన్న ఊరిలోనే పని
- పథకానికి వన్నె తెచ్చిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్
- చంద్రబాబు సర్కారు తీవ్ర నిర్లక్ష్యం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కాకినాడ సిటీ: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి శుక్రవారంతో 18 ఏళ్లు పూర్తవు తాయి. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజ శేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ పథకం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమై ఉపాధి కల్పనలో కొత్త అడుగులు వేసింది. తర్వాత అధికా రంలోకి వచ్చిన చంద్రబాబు నీరు–చెట్టు పేరుతో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఈ పథకంలో నిధులు దోచుకునేందుకు అవకాశం ఇచ్చారు. నాణ్యతకు తిలోదకాలిచ్చి నిధులు పక్కకు మళ్లించి కూలీలకు డబ్బులు సకాలంలో ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు ఉమ్మడిగా ఈ పథకానికి నిధులు కేటాయి స్తుంటాయి. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పథకంలో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పనులు జియో ట్యాగ్ ద్వారా చేపట్టి అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఆధార్ అనుసంధానం చేసి కూలీల డబ్బు సక్రమం గా అందేలా డీబీటీ విధానాన్ని తీసుకొచ్చారు.

ఇదీ లక్ష్యం..

దేశంలోని పేద కూలీల బతుకులకు భద్రత కల్పించ డంతో పాటు పస్తులు, ఆకలి చావులు, వలసలు, కరవు లేని గ్రామీణ భారతం ఆవిష్కరించేందుకు ఈ పథకం ఏర్పాటైంది. నైపుణ్యం, అవసరం లేని, శారీరక శ్రమతో కూడిన పనులు చేసేందుకు ముం దుకు వచ్చే వారందరికీ సంబంధిత కుటుంబానికి కనీసం ఏడాదికి 100 రోజులు పని దినాలు కల్పిం చడం ప్రధాన లక్ష్యం. దీని ద్వారా నిరుపేదల్లో ఆర్థిక వృద్ధి పెరిగింది. మహిళల్లో సాధికారత, కూలీల కుటుంబాల్లో ఆత్మగౌరవం పెరిగింది. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉపాధి హామీ పనులు పరుగులు తీశాయి. హార్టీకల్చర్ ద్వారా పం డ్ల తోటల పెంపకం, ఇందిర జలప్రభ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు చెందిన బీడు భూములను సాగుకు యోగ్యంగా మార్చారు. దీంతో వేల ఎకరాలు సాగు లోకి వచ్చాయి. నీటి సంరక్షణ, కాలువ పనులు, సాగునీటి సదుపాయాలకు అనుగుణంగా పనులు, భూమిని అభివృద్ధి పర్చడం వంటి పనులు చేశారు.

పనులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధి హామీ అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ వహిం చారు. ఎప్పటికప్పుడు ఉన్నత అధికారులతో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం కూలీల డబ్బులు ఏ వారానికి ఆ వారం ఖాతాలో పడుతున్నాయి. ఆధార్ అనుసంధానం చేయడంతో కూలీల డబ్బులు పక్కదారి పట్టకుండా వారి చేతికి అందుతున్నాయి. డైరెక్ట్ బెనిఫిషరి ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) విధానం వల్ల ప్రతి రూపాయి కూలీలకు చేరుతోంది. అంతేకాకుండా నీటి సంర క్షణ పనులకు ప్రాధాన్యమిస్తున్నారు.

చంద్రబాబు హయాంలో నిధులు పక్కదారి

చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో ఉపాధి పథకం సక్రమంగా అమలు కాలేదన్న విమర్శలు ఉన్నాయి. నీరు–చెట్టు పేరిట టీడీపీ నాయకులకు వరంగా మారి నిధులు దోచుకునేందుకు అవకాశం కల్పించారన్న విషయంపై ప్రజలు అప్పట్లో మండి పడ్డారు. వాస్త వంగా ఈ పనుల్లో నాణ్యత లోపించి నిధులు దుర్విని యోగం చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. విచారణలో ఇది వాస్తవమేనని నిర్ధారణ కావడం గమ నార్హం. నిధులు పక్కదారి పట్టడం, కూలీలకు డబ్బులు సకాలంలో అందకపోవడంతో అప్పట్లో ఇబ్బందులు పడ్డారు. కుట్ర పూరితంగా టీడీపీ వ్యవ హరించిందన్న విమర్శలు కూడా వచ్చాయి.

వేతనాలు భారీగా పెరుగుదల

ఈ పథకం ఉనికిలోకి రాకముందు కూలీల రోజు వేతనం రూ. 20 ఉండేది. ఈ చట్టం వచ్చాక కూలీల వేతనం గణనీయంగా పెరిగింది. కూలీలపై జరిగే ఆర్థిక దోపిడీ కనిష్ట స్థాయికి తగ్గిపోయింది. 2006–07లో పథకం ప్రారంభించిన సమయంలో రూ.80 గరిష్ట వేతనం కాగా, రూ.77.67 వచ్చేది. 2010–11లో రూ.121 గరిష్ట వేతనం కాగా రూ.91.76 దక్కింది. 2015–16లో గరిష్ట వేతనం రూ.180 కాగా రూ. 131.42 వచ్చేది. 2019–20లో గరిష్ట వేతనం రూ.211 కాగా, రూ. 210.10 ఉంది. 2023– 24లో ప్రస్తుతం గరిష్ట వేతనం రూ.272 ఉండగా రూ. 244.40గా అందుతోంది. దీనిని బట్టి చూస్తే ప్రారంభంలో గరిష్ట వేతనం రూ. 80 ఉం డగా, ప్రస్తుతం ఈ మొత్తం రూ.272కు చేరింది. పని అడిగిన 15 రోజులలోపు పని కల్పించకపోతే వారికి నిరుద్యోగ భృతి ఇవ్వాలని, పురుషులతో పాటు మహిళలకు సమాన వేతనం ఇవ్వాలని చట్టం ఉంది. పని ప్రదేశాల్లో కూలీలకు, వారి పిల్లలకు అనేక సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. కూలీలకు పనిని హక్కుగా కల్పిస్తూ ఈ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించారు.

అభివృద్ధి పనులు చేపడుతున్నాం



ఉపాధి పనుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్య మిస్తూ వస్తున్నాం. ఎప్పటి కప్పుడు క్షేత్రస్థాయిలో అధికా రులకు దిశా నిర్దేశం చేస్తున్నాం. కలెక్టర్ కృతికా శుక్లా ఈ పథకంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఆమె సూచనలు, సలహాల మేరకు ఉపాధి హామీలో మరింత అభివృద్ధి జరిగేందుకు అవ కాశం ఏర్పడింది.

– అడపా వెంకటలక్ష్మి, డ్వామా పీడీ, కాకినాడ జిల్లా

వారసత్వ సంపదను రక్షించుకోవాలి



వారసత్వ సంపద బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న రాజేంద్రసింగ్

రామన్ మెగాసెసే అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రసింగ్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): నగరంలో ఉన్న పురాతన సంపదను రక్షించుకోవాలని, పాత కట్ట డాలను కాపాడుకో వాలని కరవు, వరదల నివారణ ప్రపంచ ప్రజా కమిషన్ చైర్మన్ రామన్ మెగాసెసే అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రసింగ్ వెల్లడిం చారు. కాకినాడ నగరం ప్రస్తుతం ప్రమాదకర మైన పరిస్థితుల్లో ఉం దని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కాకినా డలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో వారసత్వ సంపద సంరక్షణపై చర్చను పీడబ్ల్యూసీ డీఎఫ్ కో– ఆర్డినే టర్ ప్రెసింగి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహిం చారు. కాకినాడ వారసత్వ సంపద సంరక్షణపై రాజేంద్రసింగ్ విలేకరులకు వివరాలను వెల్లడిం చారు. కాకినాడలోని వారసత్వ సంపదను పరిరక్షిం చుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద సమాజం మొత్తానికి చెందుతుందని వీటిని పరిరక్షించుకొని భవిష్యత్తు తరాలకు అందజేయాలన్నారు. వారసత్వ సంప దలో ప్రకృతి వనరులు, మడ అడవులు, హోప్ ఐలాండ్, తూర్పు తీర ప్రాంతం పర్యావరణం అన్నీ కూడా భాగమేనని ఆ సంపద ప్రజల ఆస్తి అని చెప్పారు. ఎంఎస్ఎన్ చారిటీస్ భూములను, ఆస్తు లను కొల్లగొట్టాలని చూస్తున్నారని, అది బాధాక రంగా ఉందన్నారు. పూర్వ కట్టడాలను ఆస్తులను కాపాడవలసిన వారే వాటిని అన్యాక్రాంత పరుస్తు న్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో ఉన్న ఎంఎస్ఎన్ చారిటీస్, పెద్ద మార్కెట్, పీఆర్ కళాశాల, మెక్లారిన్ పాఠశాల, కోస్తా తీర ప్రాంతా లను కాపాడుకోవాలంటూ హితవు పలికారు. కొన్ని ట్రస్టులు ఆయా సంపదకు రక్షణగా నిలుస్తు న్నాయని, కానీ ఆ ఆస్తులు కాపాడవలసిన దేవ దాయ ధర్మాదాయ శాఖ నిర్వీర్యం చేస్తుందని చెప్పారు. పౌర సమాజం బలంగా ఉంటేనే వార సత్వ సంపద, పురాతన కట్టడాలను కాపాడుకో వచ్చన్నారు. పేదరికం నుంచి ప్రజలకు విముక్తి కలిగించాల్సిన ట్రస్టులే పేదరికంలోకి కూరుకుపో తున్నాయని చెప్పారు. రాజేంద్ర సింగ్ హిందీలో చేసిన వ్యాఖ్యలను పర్యావరణ సామాజికవేత్త బొ లిశెట్టి సత్యనారాయణ తెలుగులోకి అనువదిం చారు. అంతకుముందు వారసత్వ సంపద సంరక్ష ణపై కాకినాడకు చెందిన పలువురు నుంచి సల హాలు తీసుకొని వాటిపై చర్చించారు. ఈ కార్య క్రమంలో జేఎన్‌టీయూకే ప్రొఫెసర్లు డాక్టర్ మురళీ కృష్ణ, ధరిత్రి రక్షిత సమితి అధ్యక్షురాలు సీమకుర్తి సురేఖ, డాక్టర్ అలపాటి శ్రీనివాస్, సామాజికవే త్తలు చిక్కాల దొరబాబు, పి.శివశంకర్, టీకే విశ్వే శ్వరరెడ్డి, కె.మృత్యుంజయరావు, ఐ.దోసగిరిరావు, గూడూరు వెంకటేశ్వరరావు, వక్కలంక రామకృష్ణ, చిక్కాల అబ్బు, నందమూరి వినోద్, ఉద్దండ రాజ్యలక్ష్మి, జి.సత్యమూర్తి, మల్లాడి రాజు, పప్పు దుర్గా రమేష్, ఎండీ జవహర్ ఆలీ, కిషోర్ కుమార్, దూసర్లపూడి రమణరాజు పాల్గొన్నారు. కాకినాడలో ఉన్న వారసత్వ సంపదను, పురాతన కట్టడాలను రక్షించేందుకు కలసికట్టుగా పయనిం చాలని తీర్మానించారు. కాకినాడ చరిత్రకు సంబం ధించి వారి దగ్గర ఉన్న బుక్‌లెట్లను పలువురు రాజేంద్రసింగ్‌కు అందించారు.

నాలుగు విడతల్లో పూర్తి రుణమాఫీ చేశారు



ఎన్నికల ముందు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వైఎ స్సార్ ఆసరా పథకంలో భాగంగా మా భువనేశ్వరి ఎస్‌హెచ్‌జీ గ్రూపు తీసుకున్న రూ.4 లక్షలు మాఫీ జరిగింది. నాలుగు విడతల్లో ఒక్కొక్క సభ్యురాలికి రూ.40 వేల చొప్పున బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణంతో నేను జీడి పప్పు ప్యాకింగ్ పరిశ్రమ ఏర్పాటు చేసుకు న్నాను. షాపుపై వచ్చే ఆదాయాన్ని బ్యాంక్‌కు క్రమం బాకీగా తీర్చడంతో మళ్లీ గ్రూపునకు రూ.10 లక్షలు మంజూరు చేశారు. నాకు ఇద్దరు పిల్లలున్నారు. స్కూల్‌కు పంపించడంతో అమ్మ ఒడి వస్తోంది. వైఎస్సార్ రైతు భరోసా కూడా రావడంతో మా కుటుంబ కష్టాలు తీరాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళలకు అండగా నిలుస్తోంది.

– తమ్మిరెడ్డి వరలక్ష్మి, తాడిమళ్ల, నిడదవోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా

ఇంటి 'పెద్దన్న'లా ఆదుకున్నాడు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత సార్వ త్రిక ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా నాలుగు విడతలుగా మంజూరు చేసిన వైఎస్సార్ ఆసరా మహిళల జీవితాల్లో వెలుగులు నింపింది. ఈ ఫొటోలో కనిపిస్తున్న యువతి పేరు పిల్లా పావని. ఆమెది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఆలమూరు మండలంలోనున్న గుమ్మిలేరు. శ్రీలక్ష్మీ గణపతి మహిళ సమాఖ్య సభ్యురాలు. భర్త పరమేసు ఆటో డ్రైవర్ కాగా కుమార్తె, కుమారుడు ఉన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగు విడతల్లో రూ.64 వేలు రుణమాఫీ జరిగింది. డ్వాక్రా రుణం, ఆసరా సొమ్ముతో అధునాతనమైన ఎలక్ట్రిక్ మెషీన్‌ను, టైలరింగ్ మెటీరియల్‌ను కొనుగోలు చేసుకుని జీవనోపాధి పొందుతోంది. ఇలాంటి ప్రజా నేత మళ్లీ మళ్లీ అధికారంలోకి వచ్చే విధంగా అందరం సహకరించాలని అంటోంది.

– పిల్లా పావని

'సిద్ధం' సభకు పటిష్ట భద్రత

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల మూడో తేదీన హాజరుకానున్న 'సిద్ధం' బహిరంగ సభకు పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నామని ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీప్రశాంతి చెప్పారు. గురువారం ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. దెందులూరు నియోజకవర్గంలోని ఆశ్రం జం క్షన్ సమీపంలో ఏలూరు జాతీయ రహదారిపై గల సహారా గ్రౌండ్స్‌లో ఈ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. శనివారం మధ్యాహ్నం చేపట్టే ఈ సభకు లక్షలాదిగా ప్రజలు తరలిరా నున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగ కుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామని తెలిపారు.

సీఎం పర్యటన ఇలా...

- 3వ తేదీ మధ్యాహ్నం 3.20 గంటలకు దెందులూ రులోని హెలీప్యాడ్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేరుకుంటారు.
- 3.25 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి 3.30 గం టలకు సభా ప్రాంగణానికి చేరుకుంటారు.
- 3.30 నుంచి 4.45 గంటల వరకు బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.
- 4.50 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి 4.55 గం టలకు హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.
- 5 గంటలకు దెందులూరు హెలీప్యాడ్ నుంచి తాడే పల్లికి తిరుగు పయనమవుతారు.

వైజాగ్ వైపు నుంచి విజయవాడ, చెన్నై వెళ్లే వాహనాల మళ్లింపు ఇలా ..

- కత్తిపూడి జంక్షన్ వద్ద మళ్లించే వాహనాలు గొల్లప్రోలు– కాకినాడ– అమలాపురం– చించినాడ బ్రిడ్జి– నర్సాపురం– మొగల్తూరు– మచిలీపట్నం మీదుగా అవి వెళ్లాలి.
- పెరవలి/ సిద్ధాంతం వద్ద మళ్లించే వాహనాలు పెనుగొండ– పాలకొల్లు– నర్సాపురం– మొగల్తూరు మీదుగా వెళ్లాలి
- తాడేపల్లిగూడెం/ తణుకు మీదుగా మళ్లించే వాహనాలు.. భీమవరం–నర్సాపురం– మొగల్తూరు– లోసరి వంతెన మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.

వైజాగ్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాల మళ్లింపు ఇలా..

- దేవరపల్లి వద్ద మళ్లించే వాహనాలు.. దేవరపల్లి– గోపాలపు రం– కొయ్యలగూడెం– జంగారెడ్డిగూడెం– జీలుగుమిల్లి– అశ్వారావుపేట– సత్తుపల్లి– ఖమ్మం మీదుగా సూర్యారావుపేట మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది.
- తాడేపల్లిగూడెం నుంచి మళ్లించే వాహనాలు.. నల్లజర్ల– కొయ్యలగూడెం– జంగారెడ్డిగూడెం– జీలుగుమిల్లి మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది.
- నారాయణపురం వద్ద మళ్లించే వాహనాలు.. దూబచర్ల– భీమడోలు– ద్వారకాతిరుమల–కామవరపుకోట– జంగారెడ్డి గూడెం మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది.

నెల్లూరు నుంచి వైజాగ్ వైపు వెళ్లే వాహనాల మళ్లింపు ఇలా :

- ఒంగోలు వద్ద మళ్లించే వాహనాలు.. తోవగుంట– బాపట్ల– చీరాల– రేపల్లె– అవనిగడ్డ–మచిలీపట్నం– చించినాడ– రాజోలు– అమలాపురం– కాకినాడ మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది.
- ఎనికేపాడు వద్ద మళ్లించే వాహనాలు.. 100 అడుగుల రోడ్డు– మచిలీపట్నం హైవే మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది.
- హనుమాన్‌జంక్షన్ వద్ద మళ్లించే వాహనాలు.. నూజివీ డు–రామన్నపేట అడ్డరోడ్డు– ధర్మాజీగూడెం– చింతలపూడి మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది.

హైదరాబాద్ నుంచి వైజాగ్‌కు వెళ్లే వాహనాల మళ్లింపు ఇలా :

- సూర్యారావుపేట వద్ద మళ్లించే వాహనాలు.. ఖమ్మం– వైరా– సత్తుపల్లి– అశ్వారావుపేట– జంగారెడ్డిగూడెం– దేవరప ల్లి మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది.
- చిల్లకల్లు వద్ద మళ్లించే వాహనాలు.. బొనకల్లు– వైరా– సత్తు పల్లి– అశ్వారావుపేట– జంగారెడ్డిగూడెం– దేవరపల్లి మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది.
- ఇబ్రహీంపట్నం మార్గంలో మళ్లించే వాహనాలు.. మైలవ రం–తిరువూరు– వీఎంబంజారా– సత్తుపల్లి– జంగారెడ్డి గూడెం– దేవరపల్లి మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది.

ఇదిగో పులి



తాడిపూడి వద్ద గోదావరి ఒడ్డున సంచరిస్తున్న పులి

తాళ్లపూడి: మండలంలో పులి సంచారం కలకలం సృష్టిస్తోంది. తాడిపూడి గోదావరి వద్ద గల ఇసుక రీచ్ లో పులి సంచరిస్తున్నట్లు పలువురు గుర్తిం చారు. గురువారం సాయంత్రం ఇసుక రీచ్‌లో గోదావరి నది తీరం వెంబడి నడుచుకుంటూ వెళ్లటాన్ని అక్కడే పని చేస్తున్న ఇసుక రీచ్‌లోని సిబ్బంది చూశారు. భయపడిన వారు పక్కనే ఉన్న గదిలోకి వెళ్లి దాక్కొన్నారు. దూరం నుంచి పులి నడుచుకుంటూ వెళ్లే దృశ్యాన్ని ఫోన్‌లో వీడియో తీసారు. గోదావరి తీరంలో తాళ్లపూడి వైపుగా నడిచి వెళ్ళింది అని వారు చెప్పారు. అది చిరుత పులిలా ఉందని అంటున్నారు. ఏది ఏమైనా గోదావరి తీర ప్రాంత వాసులు జాగ్రత్తగా ఉం డాలని తాళ్లపూడి ఎస్సై శ్యామ్ తెలిపారు.

ఆటో, బైక్ ఢీకొని ఇద్దరి మృతి



ఘటనా ప్రదేశంలో మృతదేహాలు

కొత్తపేట: మండల పరిధిలోని పలివెల–పల్లిపాలెం రోడ్డులో జరిగిన ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రావులపాలెం మండలం ముమ్మిడివర ప్పాడు గ్రామా నికి చెందిన చీమల మాధవ రావు, అతని తండ్రి నరసిం హారావు బైక్‌పై కొత్తపేట మండలం వాడపాలెం గ్రామంలో బం ధువుల ఇంటికి వచ్చి గురువారం తిరిగి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. పశ్చిమగోదావరి జిల్లా ఆచంటకు చెందిన బండి మోషే తన ఆటోతో పలివెల వైపునకు వస్తుండగా పలివెల చౌద రిపురం సత్తెమ్మతల్లి గుడి సమీపంలో ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. బైక్‌పై వెళ్తున్న మాధవరావు (43), ఆటో నడుపు తున్న మోషే (35) అక్కడికక్కడే మృతి చెందారు. నరసింహా రావు తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై డి.జ్వాలాసాగర్ మృతదే హాలను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నారు.

10న నవోదయ ప్రవేశ పరీక్ష

పెద్దాపురం: జవహర్ నవోదయ విద్యాలయలో 9,11వ తరగతి ప్రవేశానికి ఈ నెల 10వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు విద్యాలయ ప్రిన్సిపాల్ ఆర్.కమలం తెలిపారు. గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ విద్యాలయలో తొమ్మిదో తరగ తిలో ఖాళీగా ఉన్న 11 సీట్లకు 1,136 మంది, 11వ తరగతిలో ఖాళీగా ఉన్న 30 సీట్లకు 486 మంది ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేశారని చెప్పారు. పెద్దాపురం, సామర్లకోట పట్టణాల్లో ఆరు పరీక్షా కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఉదయం 10.30 నుంచి 1.45 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఆన్ లైన్‌లో హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకుని గంట ముందే పరీక్షా కేంద్రం వద్ద ఉండాలని ఆమె సూచించారు.

నేటి నుంచి టీచర్లకు ఓరియంటేషన్



డీఆర్పీలకు నిర్వహించిన సన్నాహక సమావేశం

రాయవరం: విద్యార్థులకు ఏ విధమైన విజ్ఞానాన్ని సాంకేతిక తతో స్మార్ట్‌గా బోధించవచ్చో వివరించేందుకు శుక్రవారం నుం చి సోమవారం వరకు జిల్లాలో ఉపాధ్యాయులకు ఒకరోజు చొప్పున ఓరియంటేషన్ నిర్వహిస్తున్నారు. ఆర్టిఫీషియల్ ఇంటె లిజెన్స్ ఉపయోగించి విద్యార్థులకు విజ్ఞానాన్ని మరింత చేరువ చేయడాన్ని ఉపాధ్యాయులకు తెలియజేస్తారు. ఈ శిక్షణలో ఆగ్ మెంటెడ్ రియాలిటీ(ఏఆర్), వర్చువల్ రియాలిటీ(వీఆర్) వం టి అంశాలతో విద్యార్థుల కళ్ల ముందు ప్రయోగ దృశ్యాలను ఎలా చూపించవచ్చో తెలియజేస్తారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, ఏపీ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 86 ప్రాథమికోన్నత, 237 ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో ఆరు నుంచి పదవ తరగతి వరకు గణితం, ఫిజిక్స్, బయాలజీ బోధించే ఉపాధ్యా యులకు ట్రైనింగ్ ఇవ్వనున్నారు. శుక్రవారం గణితం బోధించే ఉపాధ్యాయులకు, శనివారం ఫిజిక్స్, ఈ నెల 5న బయాలజీ బోధన చేసే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. రామచంద్రపురం ఎస్‌కేపీజీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొత్తపేట జెడ్పీ బాలి కల ఉన్నత పాఠశాల, పేరూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, రాజోలు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలల్లో ఓరియంటేషన్ తరగతులు నిర్వహించనున్నారు. 501 మంది గణితం, 333 మంది ఫిజిక్స్, 359 మంది బయాలజీ బోధన చేసే ఉపాధ్యా యులు శిక్షణ పొందుతారు. రాష్ట్ర స్థాయిలో ఒక్కో సబ్జెక్టు నుం చి శిక్షణ పొందిన 20 మంది డీఆర్పీలు ఆయా డివిజన్ కేం ద్రాల్లో జరిగే ఓరియంటేషన్ తరగతుల్లో శిక్షణ ఇవ్వనున్నారు.



ఫెరారీకి హామిల్టన్!

ఏడుసార్లు ఫార్ములావన్ వరల్డ్ చాంపియన్, బ్రిటన్ దిగ్గజ రేసర్ లూయిస్ హామిల్టన్ మెర్సిడెస్ జట్టును వీడనున్నాడు. 2013 నుంచి మెర్సిడెస్ తరఫున పోటీపడ్డ హామిల్టన్ ఈ ఏడాది తర్వాత ఆ జట్టుతో బంధం తెంచుకోనున్నాడు. 39 ఏళ్ల హామిల్టన్ 2025 సీజన్‌లో ఫెరారీ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం దాదాపు ఖరారైంది. హామిల్టన్ 2008, 2014, 2015, 2017, 2018, 2019, 2020లలో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ గెలిచాడు. 2021లో సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి తర్వాత హామిల్టన్ మరో రేసులో విజేతగా నిలువలేకపోయాడు.

సెమీస్‌లో వైదేహి-రష్మిక జోడీ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి శ్రీవల్లి రష్మిక డబుల్స్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఇండోర్‌లో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో రష్మిక-వైదేహి (భారత్) జోడీ 6-2, 6-1తో మూడో సీడ్ కరోల్ మొనెట్ (ఫ్రాన్స్)-యఫీనా (రష్యా) జంటపై నెగ్గింది. 52 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రష్మిక ద్వయం ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది.



క్వార్టర్స్‌లో గాయత్రి జోడీ



బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రెసా ద్వయం 21-15, 24-22తో భారత్‌కే చెందిన అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంటను ఓడించింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో మిథున్ 21-9, 13-21, 21-17తో కిడాంబి శ్రీకాంత్‌ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో అష్మిత 21-12, 15-21, 21-17తో యు పో పాయ్ (చైనీస్ తైపీ)పై నెగ్గగా... మాళవిక 22-24, 7-21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలైంది.

భారత్‌తో డేవిస్‌కప్ మ్యాచ్‌పై పాకిస్తాన్‌లో అనాసక్తి



ఇస్లామాబాద్: భారత్, పాకిస్తాన్‌ల మధ్య మైదానంలో పోటీ అంటేనే ఓ సమరాన్ని తలపిస్తుంది. పెద్ద హడావుడి, హంగు, ఆర్భాటం అంతా కనిపిస్తుంది. అయితే ఇదంతా క్రికెట్‌కే పరిమితం. టెన్నిస్ అంటే ఆసక్తి అంతంతమాత్రమే! ఇప్పుడు కూడా ఆరు దశాబ్దాల తర్వాత ఇరు జట్ల మధ్య పాక్ గడ్డపై ప్రతిష్టాత్మక డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్-1 పోటీలు జరగాల్సి ఉంటే... దేశంలో, రాష్ట్రంలో కాదుకదా... కనీసం వేదికైన ఇస్లామాబాద్‌లో కూడా చడీచప్పుడు లేనేలేదు. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కేవలం మీడియా, పాకిస్తాన్ టెన్నిస్ సమాఖ్య (పీటీఎఫ్) నిర్వాహకులు తప్ప ఇంకెవరి అడుగులు, చూపులు అటువైపు పడటం లేదు. మ్యాచ్‌ల కోసం పాస్‌లు, వీఐపీ పాస్‌లు కావాలనే ప్రతిపాదనలు కూడా రావట్లేదు. రేపు, ఎల్లుండి డేవిస్ కప్ మ్యాచ్ ఆడేందుకు పాకిస్తాన్‌కు వచ్చిన భారత టెన్నిస్ జట్టు సభ్యులకు అక్కడి భారత హైకమిషనర్ గీతిక శ్రీవాస్తవ విందు ఏర్పాటు చేసి ఆటగాళ్లకు బెస్టాఫ్ లక్ చెప్పారు.

మన గెలుపు హోరు వినిపించేనా!

విశాఖపట్నంలో నేటి నుంచి రెండో టెస్టు

సమరానికి సిద్ధమైన భారత్, ఇంగ్లండ్	తీవ్ర ఒత్తిడిలో టీమిండియా	ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్ 18లో ప్రత్యక్ష ప్రసారం

కోహ్లి లేడు... కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా దూరమయ్యారు. గిల్, శ్రేయస్ బ్యాటింగ్‌లో తడబాటు కనిపిస్తోంది. తొలి టెస్టులో అనూహ్య ఓటమి జట్టు ఆత్మవిశ్వాసాన్ని కాస్త దెబ్బ తీసిన పరిస్థితి. స్పిన్ మన బలం అనుకుంటే గత మ్యాచ్‌లో అరంగేట్ర స్పిన్నర్‌కే ఆటను అర్పించేశాం. ప్రత్యర్థిని చూస్తే దేనికైనా సిద్ధం అన్నట్లుగా దూకుడుతో 'సై' అంటోంది. రెండో టెస్టుకు ముందు భారత్ పరిస్థితి ఇది. ఇలాంటి సమయంలో విశాఖ తీరాన మన జట్టు తమ స్థాయికి తగ్గ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. 'బజ్‌బాల్'కు చెక్ పెట్టి 'భారత్ బాల్'తో సత్తా చాటాల్సి ఉంది.

2016లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... తొలి టెస్టులో ఇంగ్లండ్ ఆధిక్యం ప్రదర్శించగా మ్యాచ్ 'డ్రా' అయింది. తర్వాతి నాలుగు టెస్టులు గెలిచి భారత్ చివరకు సిరీస్‌ను 4-0తో గెలుచుకుంది. 2021లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... తొలి టెస్టులో భారత్ ఓటమి. తర్వాతి మూడు టెస్టులు గెలిచి భారత్ 3-1తో సిరీస్ సొంతం చేసుకుంది. ఇప్పుడు 2024లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... భారత్ తొలి టెస్టు మ్యాచ్‌లో ఓడిపోయింది. గత రెండు సిరీస్‌ల తరహాలోనే టీమిండియా ఈసారీ కోలుకొని తగిన రీతిలో సమాధానమిస్తూ ముందంజ వేస్తుందా!

సాక్షి, విశాఖపట్నం: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో 0-1తో వెనుకబడిన భారత జట్టు పోరును సమం చేసే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. హైదరాబాద్‌లో తొలి మ్యాచ్‌లో ఓడిన టీమిండియా రోహిత్ శర్మ నేతృత్వంలో ప్రతీకారానికి సిద్ధమైంది. మరోవైపు తమ జోరును కొనసాగిస్తూ సిరీస్‌లో ఆధిక్యాన్ని పెంచుకోవాలని స్టోక్స్ బృందం పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో వైజాగ్‌లోని డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో నేటి నుంచి జరిగే రెండో టెస్టు మ్యాచ్‌లో ఇరు జట్లు తలపడనున్నాయి. గత మ్యాచ్‌తో పోలిస్తే ఇరు జట్లలోనూ మార్పులు ఖాయమయ్యాయి.

పటిదార్ అరంగేట్రం!

తొలి టెస్టు ఓటమి తర్వాతి ఇప్పుడు రెండో టెస్టుకు తుది జట్టు ఎంపిక కూడా భారత్ టీమ్ మేనేజ్‌మెంట్‌కు పరీక్ష పెడుతోంది. గాయాలతో దూరమైన రాహుల్, జడేజా స్థానాల్లో రెండు మార్పులు తప్పనిసరి. రాహుల్ స్థానంలో ఒక బ్యాటర్ స్థానం కోసం రజత్ పటిదార్, సర్ఫరాజ్ ఖాన్ పోటీ పడుతున్నారు. గురువారం టీమ్ ప్రాక్టీస్, ఇతర అంశాలను బట్టి చూస్తే రజత్ వైపే ఎక్కువగా మొగ్గు ఉంది. భారత్ తరఫున పటిదార్ ఒకే ఒక వన్డే ఆడాడు. అశ్విన్, అక్షర్ మళ్లీ కీలకం కానుండగా జడేజా స్థానంలో మరో మాటకు తావు లేకుండా కుల్దీప్ మైదానంలోకి దిగుతాడు. అయితే కుల్దీప్ వస్తే బ్యాటింగ్ బలహీనంగా మారిపోతుంది. ఇలాంటి స్థితిలో ఇంగ్లండ్ తరహాలో ఒకే ఒక పేసర్‌ను ఆడించి బ్యాటింగ్ విభాగాన్ని పటిష్టం చేసుకోవడం అవసరం. అలా చేస్తే సిరాజ్ స్థానంలో సర్ఫరాజ్ అరంగేట్రం చేయవచ్చు. అయితే వీటన్నింటికంటే టాప్-4 బ్యాటింగ్ కీలకం కానుంది. ఓపెనర్లు రోహిత్, యశస్వి కాస్త ఓపిగ్గా ఆడితే భారీ స్కోరుకు కావాల్సిన శుభారంభం లభిస్తుంది. గిల్, అయ్యర్ ఇప్పటికైనా తమకు లభిస్తున్న వరుస అవకాశాలకు న్యాయం చేయాల్సి ఉంది.



హార్ట్‌లీ, స్టోక్స్

పిచ్, వాతావరణం

మంచి బ్యాటింగ్ వికెట్. కాస్త బౌన్స్‌తో పాటు మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్‌కు అనుకూలిస్తుంది. ఇక్కడ జరిగిన రెండు టెస్టుల్లోనూ భారీ స్కోర్లు నమోదు చేసిన భారత్ రెండు మ్యాచ్‌లూ (ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాలపై) గెలుచుకుంది. వర్ష సూచన లేదు.

తుది జట్లు

భారత్ (అంచనా): రోహిత్ (కెప్టెన్), యశస్వి, గిల్, శ్రేయస్, పటిదార్, భరత్, అశ్విన్, అక్షర్, బుమ్రా, సిరాజ్, కుల్దీప్. ఇంగ్లండ్: స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్, హార్ట్‌లీ, రేహాన్, బషీర్, అండర్సన్.

అండర్సన్@184



41 ఏళ్లు దాటిన పేసర్ అండర్సన్ తన కెరీర్‌లో 184వ టెస్టులో బరిలోకి దిగుతున్నాడు. అతనికి ఇది అంతర్జాతీయ క్రికెట్‌లో 22వ ఏడాది కానుండడం విశేషం. తను అరంగేట్రం చేసినప్పుడు ఇంకా పుట్టని రేహాన్, బషీర్‌లతో కలిసి అండర్సన్ బౌలింగ్ చేయబోతున్నాడు.



ఆంధ్ర క్రికెటర్ కోన శ్రీకర్ భరత్ తొలిసారి తన సొంత గడ్డపై టెస్టు మ్యాచ్ ఆడనున్నాడు. వైజాగ్‌కే చెందిన వికెట్‌కీపర్ భరత్‌కు 6 టెస్టుల స్వల్ప కెరీర్ తర్వాత ఈ అవకాశం దక్కడం విశేషం. ఈ టెస్టులో జట్టు అవకాశాల గురించి భరత్ మాట్లాడుతూ... 'అన్ని ప్రణాళికలతో మేము సిద్ధంగా ఉన్నాం. తొలి టెస్ట్ మ్యాచ్‌లో జరిగిన తప్పులపై చర్చించాం. స్వీప్ షాట్లపై సాధన చేశాం. మేం అలాంటి షాట్లన్నీ ఆడగలం. అయితే పరిస్థితిని బట్టే బ్యాటర్లు దానిని అమలు చేస్తారు. గత ఓటమి తర్వాత మేమేం ఆందోళనకు గురి కాలేదు. జట్టులో అంతా బాగుంది. సుదీర్ఘ సిరీస్ కాబట్టి కోలుకునే అవకాశం ఉందని మాకు తెలుసు' అని అన్నాడు.

బరిలోకి బషీర్...

ఇంగ్లండ్ తమ తుది జట్టును గురువారమే ప్రకటించింది. గాయపడ్డ స్పిన్నర్ జాక్ లీచ్ స్థానంలో ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లోకి అడుగు పెడుతున్నాడు. గత మ్యాచ్‌లో భారత్‌ను దెబ్బ కొట్టిన హార్ట్‌లీ మళ్లీ చెలరేగేందుకు సిద్ధంగా ఉండగా... అన్నింటికి మించి ఏకైక పేసర్ గా సీనియర్ బౌలర్ అండర్సన్ పునరాగమనం చేస్తుండటం విశేషం. వుడ్ స్థానంలో అతడిని ఇంగ్లండ్ ఎంపిక చేసింది. తొలి టెస్టులో ఎప్పటిలాగే తమ దూకుడైన బ్యాటింగే ఇంగ్లండ్‌ను గెలిపించింది. ఓపెనర్లు క్రాలీ, డకెట్ ధాటిగా ఆడుతుండగా పోప్ ఆట ఎలాంటిదో గత మ్యాచ్ చూపించింది. స్టార్ బ్యాటర్ రూట్ అటు బౌలింగ్‌లోనూ ప్రధానపాత్ర పోషించడం జట్టు బలాన్ని పెంచింది. అటు బ్యాటింగ్‌తో, ఇటు కెప్టెన్సీతో స్టోక్స్ విలువైన ఆటగాడు. ఇంగ్లండ్ ముగ్గురు స్పిన్నర్లు ఈసారి భారత్‌ను ఎలా నిలువరిస్తారనేది ఆసక్తికరం.



రోహిత్

బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442 కోట్లు

గతేడాది కంటే రూ.45.36 కోట్లు ఎక్కువ

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో క్రీడల కోసం రూ. 3,442.32 కోట్లు కేటాయించారు. 2023-24 వార్షిక బడ్జెట్‌లో రూ. 3,396.96 కోట్లు క్రీడలకు వెచ్చిస్తే ఈసారి రూ.45.36 కోట్లు పెంచారు. కేంద్ర క్రీడాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' కార్యక్రమం కోసం రూ. 900 కోట్లు (రూ.20 కోట్లు పెరుగుదల), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కు రూ. 822.60 కోట్లు (రూ.26.83 కోట్లు పెంపు) కేటాయించారు. మౌలిక వసతుల కల్పన, అథ్లెట్లకు అధునిక క్రీడా సామాగ్రి, కోచ్‌ల నియామకం కోసం ఆ మొత్తాన్ని వినియోగిస్తారు. జాతీయ క్రీడా సమాఖ్యలకు రూ 340 కోట్లు (రూ.15 కోట్లు పెంచారు) ఇవ్వనున్నారు. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) బలోపేతానికి రూ. 22.30 కోట్లు కేటాయించారు. నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీకి రూ. 91.90 కోట్లు (రూ.8.69 కోట్లు హెచ్చింపు) కేటాయించారు.

ప్రొ కబడ్డీ లీగ్ ప్లే ఆఫ్స్, ఫైనల్‌కు హైదరాబాద్ ఆతిథ్యం



బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) పదో సీజన్ ప్లే ఆఫ్స్, ఫైనల్ మ్యాచ్‌లకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 వరకు ఈ పోటీలు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతాయని పీకేఎల్ నిర్వాహకులైన మషాల్ స్పోర్ట్స్ తెలిపింది. మొత్తం 12 జట్లు పోటీ పడుతున్న ప్రొ కబడ్డీ లీగ్‌లో పాయింట్ల పట్టికలో టాప్-6లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. టాప్-2 జట్లకు నేరుగా సెమీఫైనల్ బెర్త్‌లు లభిస్తాయి. మిగతా నాలుగు జట్లు ఎలిమినేటర్ మ్యాచ్‌ల్లో తలపడతాయి. ఫిబ్రవరి 26న ఎలిమినేటర్-1లో ఆరో స్థానం పొందిన జట్టుతో మూడో స్థానంలో నిలిచిన జట్టు... ఎలిమినేటర్-2లో ఐదో స్థానంలో నిలిచిన జట్టుతో నాలుగో స్థానం పొందిన జట్టు ఆడతాయి. ఫిబ్రవరి 28న ఎలిమినేటర్-1 విజేత తొలి సెమీఫైనల్లో లీగ్ 'టాపర్'తో... ఎలిమినేటర్-2 విజేత లీగ్‌లో రెండో స్థానంలో నిలిచిన జట్టుతో పోటీపడతాయి. ఫైనల్ మార్చి 1న జరుగుతుంది.

సినిమా

గెటింగ్ రెడీ



● చిరంజీవి

'విశ్వంభర' సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు హీరో చిరంజీవి. ఈ చిత్రంలో భీమవరం దొరబాబు పాత్రలో చిరంజీవి నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. కాగా ఈ పాత్రకు సంబంధించిన మేకోవర్ కోసం చిరంజీవి కసరత్తులు చేస్తున్నారు. 'గెటింగ్ రెడీ ఫర్ విశ్వంభర' అంటూ తన వర్కౌట్స్ వీడియోను షేర్ చేశారు చిరంజీవి. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ ఈ సినిమాకు దర్శకుడు. ఆల్రెడీ చిత్రీకరణ మొదలైంది. అయితే ముందు చిరంజీవి పాల్గొనని సన్నివేశాలను చిత్రీకరించారు. హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో వేసిన సెట్స్‌లో ఈ నెల నుంచి 'విశ్వంభర' షూటింగ్‌లో చిరంజీవి పాల్గొంటారని తెలిసింది. ఇక ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. భారీ బడ్జెట్‌తో యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎమ్ఎమ్ కీరవాణి, కెమెరా: చోటా కే నాయుడు.

చలో రష్యా



● కమల్‌హాసన్

కమల్‌హాసన్ 'థగ్ లైఫ్' రష్యాలో ఆరంభం కానుందట. 1987లో వచ్చిన 'నాయగన్' (తెలుగులో 'నాయకుడు') చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్-దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'థగ్ లైఫ్'. 'జయం' రవి, దుల్కర్ సల్మాన్, త్రిష, గౌతమ్ కార్తీక్, జోజు జార్జ్, ఐశ్వర్యా లక్ష్మీ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో రంగరాయ శక్తి వేల్ నాయకర్ పాత్రలో నటిస్తున్నారు కమల్‌హాసన్. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ చెన్నైలో ప్రారంభమైంది. కమల్‌హాసన్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణను రష్యాలో ప్లాన్ చేశారట మణిరత్నం. ప్రధాన తారాగణం అంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటారని కోలీవుడ్ సమాచారం. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్.

మహేశ్ సినిమాలో?



● నాగార్జున

సూపర్ స్టార్ మహేశ్‌బాబు-కింగ్ నాగార్జున స్క్రీన్ షేర్ చేసుకోనున్నారని ఫిల్మ్‌నగర్ వర్గాలు అంటున్నాయి. ఇంతకీ ఈ కాంబినేషన్ ఏ సినిమాకీ? అంటే.. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా రూపొందనున్న చిత్రానికి అంటున్నారు. 'గుంటూరు కారం' సినిమా హిట్‌తో ఫుల్ జోష్‌లో ఉన్న మహేశ్‌బాబు తన తర్వాతి చిత్రాన్ని ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో చేయనున్న సంగతి తెలిసిందే. మహేశ్‌బాబు కెరీర్‌లో 29వ మూవీగా 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనుంది. ఈ చిత్రానికి రచయిత విజయేంద్ర ప్రసాద్ కథ అందించారు. ఇటీవలే స్క్రిప్ట్ వర్క్ పూర్తయిన ఈ ప్రాజెక్టు కోసం నటీనటుల ఎంపికపై దృష్టి పెట్టారట రాజమౌళి. ఈ సినిమాలో సౌత్ ఇండస్ట్రీకి చెందిన పలువురు స్టార్స్ కీలక పాత్రల్లో నటించనున్నారని తెలిసింది. ఇందులో భాగంగానే నాగార్జున కూడా కీలక పాత్రలో నటించనున్నారని టాక్. సినిమాలో చాలా ప్రాధాన్యం ఉన్న ఓ పాత్రకి నాగార్జునని తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారట రాజమౌళి. నాగార్జునకి దక్షిణాదితో పాటు ప్రత్యేకించి బాలీవుడ్‌లోనూ మంచి గుర్తింపు ఉంది. అందుకే జాతీయ స్థాయిలో పేరున్న నాగార్జునను 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' కోసం తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భోగట్టా. ఏప్రిల్‌లో ఈ సినిమా ప్రారంభం కానుంది. మరి మహేశ్‌బాబు-నాగార్జున కాంబో తెరపై కనిపిస్తుందా? అంటే ఇప్పటికైతే సమాధానం లేని ప్రశ్న.

సరికొత్త కథతో శ్రీకారం



● అమర్‌దీప్, సుప్రీత

'బిగ్ బాస్' ఫేమ్ అమర్‌దీప్ చౌదరి హీరోగా, నటి సురేఖా వాణి కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా కొత్త చిత్రానికి శ్రీకారం జరిగింది. ఈ చిత్రానికి మాల్యాద్రి రెడ్డి దర్శకుడు. మహర్షి కూండ్ల సమర్పణలో ఎం3 మీడియా బ్యానర్‌పై మహా మూవీస్‌తో కలిసి మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్న ఈ సినిమా గురువారం ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత ఏఎం రత్నం కెమెరా స్విచ్చాన్ చేయగా, బసిరెడ్డి క్లాప్ కొట్టగా, వీర శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ– ''ఇండియన్ సినిమాలో ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని కొత్త కథతో ఈ సినిమాని రూపొందిస్తున్నాం'' అన్నారు. ''మాలాంటి కొత్త వాళ్లకి ఎం3 మీడియా చాన్స్ ఇవ్వడం హ్యాపీగా ఉంది'' అన్నారు మాల్యాద్రి రెడ్డి. ''బిగ్ బాస్'కి వెళ్లకముందే ఈ సినిమా ఒప్పుకున్నాను'' అన్నారు అమర్‌దీప్ చౌదరి. సుప్రీత, నటీనటులు సురేఖా వాణి, తేజస్వి, గౌతమ్ కృష్ణ, రఘు, నటుడు, దర్శకుడు తల్లాడ సాయికృష్ణ మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: దాస్ కడియాల, కెమెరా: బాల సరస్వతి.

వేసవిలో మ్యాచ్



● సిద్ధార్థ్, నయనతార, మాధవన్

'ది టెస్ట్'ను పూర్తి చేశారు నయనతార. క్రికెట్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో నయనతారతో పాటు మాధవన్, సిద్ధార్థ్ లీడ్ రోల్స్ చేశారు. మీరా జాస్మిన్ ఓ కీలక పాత్రలో నటించిన ఈ సినిమాతో నిర్మాత శశికాంత్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సింగర్ శక్తిశ్రీగోపాలన్ మ్యూజిక్ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు, ఈ వేసవిలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. కాగా ఈ సినిమాను గత ఏడాది నవంబరులో విడుదల చేయాలనుకున్నారు. కానీ ఇప్పుడు వేసవికి వాయిదా వేశారు. తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

విన్నర్‌గా ఎలా మారాడు?



● గీతానంద్

''గేమ్ ఆన్' యునిక్ స్టోరీ. రెగ్యులర్‌గా కాకుండా వైవిధ్యంగా చేయాలని ప్రయత్నించాం. ఈ చిత్రంలో హీరో లూజర్ నుంచి విన్నర్‌గా ఎలా మారాడు? అనేది ఆసక్తిగా ఉంటుంది. ఇందులో భాగంగా ఉండే టాస్కులు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని గీతానంద్ అన్నారు. దయానంద్ దర్శకత్వంలో గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఆన్'. రవి కస్తూరి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతున్న సందర్భంగా హీరో గీతానంద్ మాట్లాడుతూ–''దయానంద్ నా తమ్ముడు కావడంతో 'గేమ్ ఆన్' స్క్రిప్ట్ విషయంలో బాగా చర్చించుకునే వాళ్లం. రవి కస్తూరి కూడా నా ఫ్రెండ్ కావడంతో ముగ్గురం చర్చించుకుని నిర్ణయాలు తీసుకునేవాళ్లం. ఈ మూవీకి సీక్వెల్ ప్లాన్ ఉంది'' అన్నారు.

తెలుగు, నేపాలీ భాషల్లో...



● బ్రహ్మానందం

ప్రముఖ నటుడు బ్రహ్మానందం కీలక పాత్ర పోషిస్తున్న తొలి తెలుగు, నేపాలీ చిత్రం 'హ్రాశ్వ దీర్ఘ'. చంద్ర పంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హరిహర్ అధికారి, నీతా దుంగన లీడ్ రోల్స్ చేస్తున్నారు. నీతా ఫిలిమ్స్ ప్రొడక్షన్స్‌పై నీతా దుంగన ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఫిబ్రవరి 1న బ్రహ్మానందం పుట్టినరోజు. ఈ సందర్భంగా 'హ్రాశ్వదీర్ఘ'లోని ఆయన పాత్రకి సంబంధించిన ఫస్ట్ లుక్‌ని విడుదల చేయడంతో పాటు ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 27న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

పల్లెటూరి ప్రేమకథ



● శ్రీకాంత్, వినాయక్ దేశాయ్

వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించిన చిత్రం 'రాధా మాధవం'. గోనాల్ వెంకటేశ్ నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''రాధా మాధవం' ట్రైలర్ చూస్తే అందమైన ప్రేమకథా చిత్రమని తెలుస్తోంది. ట్రైలర్ చాలా బాగుంది.. సినిమా పెద్ద హిట్టవ్వాలి'' అన్నారు. ''అందమైన పల్లెటూరి ప్రేమకథా చిత్రం 'రాధా మాధవం'. మా సినిమా సెన్సార్ పనులు జరుపుకుంటోంది'' అన్నారు దాసరి ఇస్సాకు. ''ఈ నెలలోనే మా సినిమా రిలీజ్ అవుతుంది.. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు గోనాల్ వెంకటేశ్. ''పల్లెటూరి నేపథ్యంలో సాగే ప్రేమకథతో సహజత్వం ఉట్టి పడేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు దాసరి ఇస్సాకు. మా చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసిన శ్రీకాంత్‌గారికి థ్యాంక్స్'' అన్నారు వినాయక్ దేశాయ్.

మ్యూజిక్ కూడా కథ చెబుతుంది

- దేవ్ జాంద్



రవితేజ హీరోగా నటించిన చిత్రం 'ఈగల్'. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ దేవ్ జాంద్ మాట్లాడుతూ– ''నా పదో తరగతి నుంచే మ్యూజిక్ జర్నీ స్టార్ట్ చేశాను. పియానో, గిటార్, డ్రమ్స్, ప్రొగ్రామింగ్ నేర్చుకున్నాను. కొన్ని వీడియో గేమ్స్‌కి మ్యూజిక్ ఇచ్చాను. సంగీత దర్శకుడిగా 'ఈగల్' నాకు తొలి చిత్రం. కాలేజీలో నేను, హీరో శ్రీవిష్ణు క్లాస్‌మేట్స్. అలా కార్తీక్ నాకు పరిచయం అయ్యాడు. ఇప్పుడు తనతో నా జర్నీ మొదలైంది. రవితేజగారితో సినిమా ఫిక్స్ అయ్యాక ఆయన ఓకే చెబితే, మ్యూజిక్ డైరెక్టర్‌గా నాకు చాన్స్ ఇస్తానన్నాడు కార్తీక్. రవితేజగారు నా మ్యూజిక్ ట్రాక్స్ విని, నచ్చి ఓకే చేశారు. రవితేజగారి సినిమాకు మ్యూజిక్ చేయడం నా లక్. ఈ సినిమాలో మ్యూజిక్, ఆర్ఆర్‌లకు మంచి స్కోప్ ఉంది. మ్యూజిక్ కూడా కథ చెబుతున్నట్లుగా ఉంటుంది. ఈ సినిమాలో నాలుగు పాటలు ఉన్నాయి. ఇక కార్తీక్ దర్శకత్వంలోనే తేజ సజ్జా హీరోగా చేస్తున్న ఓ సినిమాకు, దర్శకుడు నక్కిన త్రినాథరావుగారి ప్రొడక్షన్‌లోని ఓ మూవీకి మ్యూజిక్ ఇస్తున్నాను. మరో రెండు ప్రాజెక్ట్స్ ఉన్నాయి'' అని చెప్పుకొచ్చారు.